సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం | 7 | జూలై | 2024



నిత్య నిర్మలా గోవిందా..

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరా స్వామి క్షేత్రం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


8లో



ప'దొండ'య్ సాగుకు..

సంప్రదాయంగా పండించే వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తే రైతులు దండిగా లాభాలు పొందవచ్చు. ఇటీవల పలువురు దొండ సాగు వైపు మళ్లుతున్నారు.

డెల్టాలకు 11,920 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 11,920 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3 వేలు, సెంట్రల్ 2,420, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సీతానగరం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సీతానగరం: విధి నిర్వహణలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. సీతానగరం పంచాయతీని కలెక్టర్ ప్రశాంతి బుధవారం సందర్శించారు. ఆ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా సక్రమంగా లేవని గుర్తించారు. దీనిపై ఆగ్రహం చెందిన ఆమె.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీతానగరం పంచాయతీ కార్యదర్శి సీహెచ్ నాగ సతీష్‌ను సస్పెండ్ చేయాలని, ఈఓ పీఆర్‌డీ కేవీఎస్ఎస్ మూర్తికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) డి.రాంబాబును ఆదేశించారు. పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ప్రతి రోజూ వెబెక్స్ సమావేశాల ద్వారా చెబుతున్నామని డీపీఓ రాంబాబు ఈ సందర్భంగా తెలిపారు. అయినప్పటికీ సీతానగరం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి నాగ సతీష్ తీవ్ర అసత్వం వహించారని, దీంతో, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. వంగలపూడి పంచాయతీ కార్యదర్శి రేఖపల్లి సుజాతకు సీతానగరం పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇవ్వడంలో, గ్రామంలో పారిశుధ్య పరిస్థితిని పర్యవేక్షించడంలో విఫలమైన ఈఓ పీఆర్‌డీ మూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేశామని డీపీఓ రాంబాబు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి శివకుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఒకటో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.శివకుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై రాజమహేంద్రవరం నగరానికి చెందిన న్యాయమూర్తులు కోర్టు సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, అతి వేగం ప్రమాదకరమని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరూ వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలా కాకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు కూడా ప్రసంగించారు. జిల్లా రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసు అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.రామ్‌నారాయణ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సబిత తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



ఆర్‌జేడీ నాగమణి సమక్షంలో తల్లులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

పెదపూడి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) జి.నాగమణి అన్నారు. సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మాతృదేవోభవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో 200 మంది తల్లులకు విద్యార్థులతో పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో విద్యార్థుల్లో నైతిక విలువలు దెబ్బతింటున్నాయని, వాటిని కాపాడే దిశగా ఇటువంటి కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహించాలని అన్నారు. అనంతరం నాగమణికి కూడా విద్యార్థులు పాదపూజ చేశారు. పాలిటెక్నిక్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పాఠశాల విద్యార్థులకు నగదు పురస్కారాలు, పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన, నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు కొమ్మన శ్రీనివాసరావు, మట్టా రామయ్యన్న, కాకినాడ డీవైఈఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భయేరియా!



- విజృంభిస్తున్న డయేరియా
- చాప కింద నీరులా వ్యాప్తి
- ఇప్పటికే పలువురికి చికిత్స
- తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాలు



రంగంపేట మండలం ఈలకొలను పంచాయతీ అచ్యుతాపురంలో డయేరియా నియంత్రణపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: డయేరియా దడ పుట్టిస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రోజు రోజుకూ చాప కింద నీరులా విస్తరిస్తోంది. కొద్ది రోజుల కిందట రంగంపేట మండలం ఈలకొలను పంచాయతీ అచ్యుతాపురంలో ఎనిమిది మంది, గోపాలపురం మండలం గుడ్డిగూడెంలో ఆరుగురు డయేరియా బారిన పడటం కలకలం రేపింది. జిల్లాలోని వివిధ గ్రామాల్లో పది రోజులుగా డయేరియా ప్రబలడం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వర్షాల సీజన్ ఆరంభం కావడం వ్యాధి వ్యాప్తికి మరింత దోహదం చేస్తోంది. దీనిపై సకాలంలో మేల్కొనకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా చిన్నారులు ఉన్న తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వ్యాధితో చిన్నారులు మరణం అంచుకు చేరే ప్రమాదం ఉంటుంది. డయేరియాతో పాటు సీజనల్ వ్యాధుల సంక్రమణపై వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సి ఉండగా అది తూతూమంత్రంగానే జరుగుతోందన్న విమర్శలున్నాయి. కేసులు నమోదైన గ్రామాల్లో మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు తప్ప, మిగిలిన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధి బారిన పడి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు

డయేరియా లక్షణాలతో బాధ పడుతూ రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ప్రతి రోజూ ముగ్గురి నుంచి నలుగురు వస్తున్నారు. ముఖ్యంగా సీతానగరం, కొంతమూరు, కడియం, గోపాలపురం, శాటిలైట్ సిటీ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా బాధితులు వస్తున్నట్లు చెబుతున్నారు.



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

వీరిలో ఔట్ పేషెంట్లు(ఓపీ)గా వైద్య సేవలు పొందుతున్న వారే అధికంగా ఉంటున్నారు. వ్యాధి తీవ్రత దృష్ట్యా 12 మందికి ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి, వైద్యం అందిస్తున్నారు. డయేరియా కేసులు వస్తున్న నేపథ్యంలో ఆసుపత్రిలో 18 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఒకరు కోలుకుని వెళ్తుంటే మరొకరు ఆసుపత్రిలో చేరుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు కేసులు వస్తున్నా బయటకు చెప్పడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇది సరి కాదని, వ్యాధి తీవ్రతను బట్టి వైద్యం అందించాల్సి ఉంటుందని, దాపరికం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డయేరియా కేసులు నమోదవుతున్న గ్రామాల్లో వైద్యాధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప.. మిగిలిన గ్రామాలపై కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు కూడా వస్తున్నాయి.

పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా అధిక శాతం గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతోంది. కాలం చెల్లిన పైపులైన్లనే ఇప్పటికీ వినియోగించడం, అవి కూడా పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో ఉండటం నీటి కాలుష్యానికి కారణమవుతోంది. దీనికి తోడు ఇప్పటికీ అనేక పల్లెల్లో బోర్లు, బావుల నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారు. ఆ నీటిని నేరుగా తాగడం వల్ల ప్రజలు డయేరియా బారిన పడుతున్నారు. కల్తీ ఆహారం తినడం, అపరిశుభ్ర పరిసరాలు, జీవన విధానంలో లోపాలు కూడా డయేరియా వ్యాప్తికి ప్రధాన కారణమవుతున్నాయి.

సీజనల్ వ్యాధులపై ఫోకస్ ఏదీ?

సరిగ్గా ఇదే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో దోమలు విజృంభించి, మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా ఇతర రోగాలు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైందంటే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి ప్రాణాంతక సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. వీటి బారిన పడి అనేక మంది ఆసుపత్రుల పాలై ఆరోగ్య పరంగా, ఆర్థికంగా అవస్థలు పడుతూంటారు. ప్రధానంగా జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సీజనల్ వ్యాధులు ఎక్కువ శాతం ప్రబలే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, మరోపక్క దోమల విజృంభణతో టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ఇప్పటికే మొదలవుతున్నాయి.

ప్రకటనలకే పరిమితం

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ, సంబంధిత సమన్వయ శాఖలు చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయనే విమర్శ వస్తోంది. పల్లెల్లో బావులు, బోర్లు, కుంటలు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు గంబూషియా చేపలను వదలాల్సి ఉన్నా.. ఎక్కడా అటువంటి దాఖలాలు లేవు. మలేరియా కేసులు అధికంగా వస్తున్న గ్రామాల్లో మాస్ సర్వే నిర్వహించాల్సి ఉన్నా ఆ జాడే లేదు.

మెరుగైన చికిత్స



రాజమహేంద్రవరం బోధనాసుపత్రికి ప్రతి రోజూ డయేరియా కేసులు వస్తున్నాయి. ఓపీలో ముగ్గురి నుంచి నలుగురు చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న రోగులను ఆసుపత్రిలో చేర్చుకుంటున్నాం. డయేరియా రోగులకు వైద్యం అందించేందుకు 18 పడకలతో కూడిన రెండు గదులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. మెరుగైన చికిత్స అందిస్తున్నాం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితి చేయి దాటక ముందే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

– డాక్టర్ వీవీవీ సత్యనారాయణ, విభాగాధిపతి, జనరల్ మెడిసిన్, ప్రభుత్వ బోధనాసుపత్రి, రాజమహేంద్రవరం

ఈ చర్యలు అవసరం

- ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి. ఇళ్ల ఆవరణలో ఉపయోగించని డబ్బాలు, కుండలు, పాత టైర్లు, కూలర్లు, నీటి తొట్టెలు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసి ఆరబెట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- పైపులైన్లు, గేట్ వాల్వ్ లీకేజీలను అరికట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి.
- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలి. అవసరమైనచోట సోడియం హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయించాలి.
- మురుగు కాలువల్లో పూడికలు తొలగించాలి. వర్షపు నీరు దగ్గరలోని కుంటలు, చెరువుల్లోనికి ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. కాలువల వెంట పిచ్చి మొక్కలను తొలగించాలి. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాల్సి ఉన్నా.. ఈ పరిస్థితి జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు.
- కొద్ది రోజుల కిందట డయేరియా ప్రబలిన రంగంపేట మండలం ఈలకొలను పంచాయతీ అచ్యుతాపురంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఇటీవల పర్యటించారు. డయేరియా నియంత్రణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ, సమన్వయ శాఖల అధికారులను స్పష్టంగా ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని, గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కానీ, ఈ కార్యక్రమాలు జిల్లాలో పూర్తి స్థాయిలో జరుగుతున్న దాఖలాలు కానరావడం లేదు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

తలుపులమ్మ ఆషాఢ మాసోత్సవాలు ఆరంభం

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు ఆరంభమయ్యాయి. ప్రధానార్చకులు, వేద పండితులు అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆగస్టు ఐదో తేదీ వరకూ ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆదివారం వివిధ రకాల మట్టిగాజులతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పిస్తామని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. అమ్మవారిని దర్శించేందుకు వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా తుని రూరల్ సీఐ, ఎస్సైలను కోరామని చెప్పారు. దేవస్థానం నుంచి మరో 20 మంది ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించామన్నారు. కొండ పైన, దిగువన రెండు పోలీసు అవుట్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకోనున్నామన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలను సిద్ధం చేశామని చెప్పారు.

తవ్వకం, రవాణా ఖర్చుల వసూలు

- పరిపాలనా పరమైన చార్జీలు కూడా..
- ఉచిత ఇసుకపై మార్గదర్శకాలు అమలు చేయాలి
- మొదట వచ్చిన వారికి మొదట ఇవ్వాలి
- ఒక్కొక్కరికి 20 టన్నుల వరకూ మాత్రమే..
- స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా
- జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ప్రకారం వినియోగదారుల నుంచి ఇసుక తవ్వకం, రవాణా, పరిపాలనా పరమైన ఖర్చులు వసూలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఇసుక పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలు పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ఉచిత ఇసుక విధానంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం జిల్లా కలెక్టర్లతో విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్ఏ) సమావేశానికి కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద డిప్యూటీ తహసీల్దార్, ఆపై స్థాయి అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందని, మూడు షిఫ్టులలో విధులు నిర్వర్తించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఇసుక కోసం వచ్చిన వారి వ్యక్తిగత ఆధారాలు, వివరాలు తీసుకుని ఒక్కొక్కరికి 20 టన్నుల వరకూ మాత్రమే సరఫరా చేయాలని స్పష్టం చేశారు. అంతకు మించి కావాలంటే డీఎల్ఎస్ఏ ద్వారా సమీక్షించి, అనుమతి జారీ చేయాల్సి ఉంటుందన్నారు. మొదట వచ్చిన వారికి మొదట అనే విధానంలో ఇసుక అమ్మకాలు జరపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎటువంటి ఫిర్యాదులకూ ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా, డివిజనల్ స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. స్టాక్ పాయింట్లు, డీసిల్టేషన్ పాయింట్ల వద్ద మండల రెవెన్యూ, స్టేషన్ హౌస్ అధికారులతో నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇసుక రవాణా వాహనాలు, వాటి సామర్థ్యం, జీపీఎస్ ట్రాకింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక సక్రమంగా రవాణా అయ్యేలా చూడాలని, ధరల నియంత్రణపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, సెబ్ ఆధ్వర్యంలో బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. కొత్తగా పూడికలు తీసేందుకు ఏజెన్సీలు, బోట్స్‌మెన్ సొసైటీలను టెండర్ ద్వారా ఎంపిక చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్‌డీఓ ఎ.చైత్రవర్షిణి, జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి జిల్లా, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. సంబంధిత చట్టంపై జిల్లా అధికారులు, ఫిర్యాదుల కమిటీ నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ చట్టం ప్రకారం పది మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు పని చేసే ప్రతి కార్యాలయంలోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. లైంగిక వేధింపులపై ఫిర్యాదుల పరిష్కారానికి, సురక్షిత పని వాతావరణానికి ఈ కమిటీ బాధ్యత వహిస్తుందన్నారు. కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఉన్న జిల్లా స్థాయి కమిటీలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ కుమారి, గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి డీఎల్‌డీఓ వీణాదేవి, ఏకలవ్య చిల్డ్రన్ హోమ్ ప్రతినిధి పి.శేషారత్నాన్ని సభ్యులుగా నియమించామని కలెక్టర్ వివరించారు.

కొబ్బరికి నిబంధనల కొర్రీ

- రేపటి నుంచి కొనుగోలు కేంద్రాలు
- నాఫెడ్ వస్తున్నా పెరగని ధర
- స్థానిక కొబ్బరి కొంటేనే రైతులకు మేలు

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి కొనుగోలుకు సోమవారం నుంచి నాఫెడ్ కేంద్రాలు తెరుచుకోనున్నాయి. ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారంటే సహజంగా బహిరంగ మార్కెట్‌లో కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరగడం పరిపాటి. ఈ సారి మాత్రం ఆ పరిస్థితి లేదు. స్థానిక కొబ్బరిని నిబంధనల పేరుతో కొనుగోలు చేయకపోవడమే దీనికి కారణం. ఇదే అవకాశంగా దళారులు ఇతర రాష్ట్రాల నుంచి కొబ్బరి తేవడంతో ఇక్కడి మార్కెట్లో ధరల పెరుగుదల లేకుండా పోయింది.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. సగటున ఎకరాకు 7 వేల కొబ్బరికాయలు చొప్పున 126 కోట్ల కాయలు దిగుబడిగా వస్తోందని అంచనా. వస్తున్న కొబ్బరిలో 80 శాతం కాయ రూపంలో నేరుగా ఎగుమతి అవుతుంది. గతంలో స్థానికంగా ఎండు కొబ్బరి తయారీ (కొత్త కొబ్బరి, మిల్లింగ్ కోప్రా) ఉత్పత్తి చేసేవారు. తరువాత కాలంలో నల్లి తెగులు, తెల్లదోమ వంటి కారణాలతో దిగుబడి లేకపోవడంతోపాటు కాయ సైజు తగ్గిపోయింది. అప్పటి నుంచి స్థానిక ఎండు కొబ్బరికి ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గింది. దీంతో స్థానిక వ్యాపారులు, రైతులు ఎండు కొబ్బరి తయారీని పూర్తిగా నిలిపివేశారు. కేవలం ఆలయాల వద్ద భక్తులు కొట్టే కొబ్బరి చిప్పల నుంచి మాత్రమే ఎండు కొబ్బరి తయారు చేస్తున్నారు. అది కూడా చాలా తక్కువ మొత్తంలోనే. ఇది ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రోజుకు టన్ను కూడా ఉండదని రైతులు చెబుతున్నారు.



నాఫెడ్ కేంద్రంలో ఎండు కొబ్బరి

కొనుగోలు చేయకే ఇబ్బంది

కొబ్బరి ధర తగ్గినప్పుడు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) ద్వారా ఎండు కొబ్బరి మిల్లింగ్ కోప్రాను కొనుగోలు చేస్తూ ఉంటారు. ఇక్కడ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు కొంటారు. ప్రస్తుత కొనుగోలు ధర క్వింటాలు రూ.11,160. ఇదే సమయంలో అంబాజీపేట మార్కెట్‌లో ధర రూ.9,500 మాత్రమే ఉంది. నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తారనే నమ్మకం ఉంటే ఎండు కొబ్బరి ధర బహిరంగ మార్కెట్‌లో పెరగాల్సి ఉన్నా కదలిక లేకుండా పోయింది. ఎండు కొబ్బరి తయారైతే ఆ ప్రభావం వల్ల పచ్చి, కురిడీ కొబ్బరి ధరలు సైతం పెరుగుతాయి. కానీ స్థానికంగా కొనుగోలు చేసే అవకాశం లేనందున కొబ్బరి ధరలు పెరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా మిల్లింగ్ కోప్రా తక్కువగా ఉండడం, పైగా నాఫెడ్ కొనుగోలు కోసం విధించిన నిబంధనలకు సరిపడే విధంగా ఉత్పత్తి జరగకపోవడంతో 2020-21, 2021-22లో కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోలు జరగలేదు. కానీ గత ఏడాది మాత్రం ఏకంగా 40,359 క్వింటాళ్ల కొబ్బరి కొనుగోలు చేశారు. రైతులు ఇక్కడ కొబ్బరి నేరుగా విక్రయించే అవకాశం లేదు. ఈ నిబంధనలకు అనుగుణంగా స్థానికంగా కొబ్బరి ఉత్పత్తి చాలా తక్కువ ఉంది. స్థానికంగా ఎండు కొబ్బరిని ఉత్పత్తి చేయడంతోపాటు నాఫెడ్‌లో కొనుగోలు చేస్తేనే మిగిలిన కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశముంది. ఇది జరగాలంటే స్థానిక ఉత్పత్తులను నాఫెడ్ కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలి. ఇక్కడి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నాఫెడ్ నిబంధనలను సడలించాలని రైతులు కోరుతున్నారు.



అంబాజీపేట మార్కెట్ యార్డులో కొబ్బరిని పరిశీలిస్తున్న నాఫెడ్ అధికారులు (ఫైల్)

రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే..

సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు ఈ నెల 8న నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో ప్రారంభిస్తాం. కొబ్బరి విక్రయించే రైతులు తమ రిజిస్ట్రేషన్లను ఆర్బీకేల్లో గత నెల 19 నుంచే చేసుకున్నారు. వారి నుంచి మాత్రమే కొబ్బరిని కొనుగోలు చేస్తాం. నాఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో బాల్‌కోప్రా క్వింటాలుకు రూ.12 వేలు, మిల్లింగ్ కోప్రాను రూ.11,160గా ధర నిర్ణయించాం. నెలలో ఎకరానికి రెండు బస్తాల కొబ్బరిని అనుమతిస్తాం. ఈ కొనుగోలు కేంద్రం సెప్టెంబర్ వరకూ కొనసాగిస్తాం. అనంతరం అధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ ఉంటుంది. నాఫెడ్ కేంద్రం ప్రారంభానికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నాఫెడ్, ఆయిల్ ఫెడ్ అధికారులు హాజరవుతారు.

– యు.సుధాకరరావు, ఆయిల్ ఫెడ్ మేనేజర్, గణపతి వీరరాఘవులు, కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్

శునక షోయగం


రేబిస్ వ్యాక్సిన్ వేయించేందుకు పెంపుడు జంతువులతో..


దాని అల్లరి.. ఆమెకు మురిపెం

జూలు విదిలిస్తూ.. చూడచక్కని రూపంతో ఆకర్షిస్తూ.. అమాయకంగా చూస్తూ.. గంభీరంగా కనిపిస్తూ.. ఇలా శునకాల ‘షో’యగం అద్భుతం. రాజమహేంద్రవరం ఏరియా పశు వైద్యశాల ఆవరణలో శనివారం పెంపుడు జంతువులు సందడి చేశాయి. ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా జిల్లా పశువైద్య, ఆరోగ్య శాఖలు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జంతువులు, వాటి యజమానులు, ఇతర సిబ్బందికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేశారు. పెంపుడు జంతువులను లాలిస్తూ, బుజ్జగిస్తూ యజమానులు నిరీక్షించారు. ముఖ్యంగా బుజ్జిబుజ్జి శునకాలు, పిల్లులు, గుర్రాలు ముచ్చటగొల్పాయి. యజమానులపై అవి ఎంతో ప్రేమ చూపుతూ, విధేయంగా మెలుగుతూ అలరించాయి.

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)


బుల్లి యజమానితో చిట్టి శునకం


మెడ మీద ఎక్కి గారం చేస్తున్న పిల్లి

అధ్యాపక పోస్టుల భర్తీకి 9న ఇంటర్వ్యూలు

కాకినాడ రూరల్: వలసపాకలలోని కాకినాడ కేంద్రీయ విద్యాలయలో ఒప్పంద ప్రాతిపదికన హిందీ అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 9వ తేదీ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.శేఖర్ తెలిపారు. హిందీ సబ్జెక్ట్‌లో డిగ్రీ, బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఆ రోజు ఉదయం 9 గంటలకు కేంద్రీయ విద్యాలయకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.kakinada.kvs.ac.inలో చూడాలని అన్నారు.

పదొండయ్ సాగుకు...

- అధిక లాభాలకు ఆస్కారం
- ప్రభుత్వ రాయితీలూ పొందవచ్చు
- జిల్లాలో 500 ఎకరాల్లో సాగు


కోతకు వచ్చిన దొండ పాదులు

పాడి-పంట

రాయవరం: కాస్త భిన్నంగా సాగితే విజయమే.. సాగులో ప్రత్యామ్నాయ విధానాలతో సిరులే.. సంప్రదాయంగా పండించే వరికి బదులు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తే లాభాలే.. ఇప్పటికే కొందరు రైతులు దొండ సాగు వైపు మళ్లుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో దొండ సాగును ఇటీవల కాలంలో అధిక శాతం రైతులు చేపడుతున్నారు. ప్రధానంగా ఆత్రేయపురం, పి.గన్నవరం, రావులపాలెం, ఆలమూరు, కె.గంగవరం, రాయవరం, కొత్తపేట, అయినవిల్లి తదితర మండలాల్లో ఈ సాగు ఊపందుకుంది.

తీగజాతి రకానికి చెందిన దొండ సాగు అధిక లాభాలు తెచ్చిపెడుతోంది. ఒకసారి దొండ పంట వేస్తే మూడేళ్ల పాటు దిగుబడులు వస్తాయి. మొదట్లో పెట్టుబడులు ఎక్కువైనా దిగుబడులు బాగా రావడంతో రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. ఈ సాగు లాభదాయకంగా ఉండడంతో ఇటీవల కాలంలో కూరగాయలు సాగు చేసే రైతులు దొండ వైపు మక్కువ చూపుతున్నారు.

జాగ్రత్తలు అవసరం

- దొండ పాదుకు చెందిన తీగను కట్ చేసి లావుగా ఉన్న తీగను మొక్కగా నాటాలి. కణుపునకు కొద్దిగా కింద భాగంలో ఏటవాలుగా కట్ చేసి నాటాలి.
- ఈ పాదు నాటే సమయంలో పెంట ఎరువు, వర్మీ కంపోస్ట్ వంటి ఎరువులతో పాటు 250 నుంచి 500 గ్రాముల వేప పిండిని (వేప చెక్క) మొక్క అడుగు భాగంలోని మట్టిలో బాగా కలియబెట్టాలి.
- మొక్క నాటిన వెంటనే నీరు పెట్టి, మొక్క మొదలు చుట్టూ ఎండు గడ్డిని పరిచి నీరు చల్లుతుండాలి. చిగురు పట్టే దశలో ఎండు గడ్డిని తీసివేయాలి.
- మొక్క పెరుగుదల దశలో వైరస్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ఈ పాదులతో పాటు గడ్డి పెరగకుండా చూసుకోవాలి. గడ్డి పెరిగితే దొండకు హాని చేసే పురుగులు, కీటకాలు పాదులకు హాని చేస్తాయి.



- ఎండిపోయిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేసి 5 శాతం యూరియా ద్రావణాన్ని మొక్కపై స్ప్రే చేయాలి. ఎండలు అధికంగా ఉండే సమయంలో ఏ మాత్రం యూరియా ద్రావణం మోతాదు ఎక్కువైతే మొక్కల ఆకులు మాడిపోతాయి.
- పది లీటర్ల నీటికి 50 గ్రాముల యూరియాను కలిపి దానిని మొక్కల ఆకులపై స్ప్రే చేయాలి. ఆకుల పైభాగం, కింద భాగం తడిచేలా స్ప్రే చేయాలి.

దిగుబడి.. ఆదాయం

ఎకరం చేనులో 1,200 నుంచి 1,400 వరకూ దొండ పాదు మొక్కలు నాటుకోవచ్చు. ఈ పాదులకు ఎకరానికి రూ. లక్ష వరకూ ఖర్చవుతుంది. ఎకరానికి సీజన్‌లో 10 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఎకరాకు సుమారు రూ. 50 వేల వరకూ నికర ఆదాయం వచ్చే అవకాశముంది. అందుకే అంతా ఈ సాగు చేపడుతున్నారు.

రాయితీలు ఎలా అంటే..

ఉద్యాన శాఖ ద్వారా దొండ సాగుకు రాయితీలు ఇస్తున్నారు. ఈ సాగుకు పందిరి అవసరం. హైబ్రీడ్ వెజిటబుల్ కల్టివేషన్‌లో భాగంగా కర్ర పందిరికి ఎకరాకు రూ.8 వేల రాయితీ ఇస్తున్నారు. గరిష్టంగా ఒక రైతుకు 2.5 ఎకరాల వరకూ రాయితీకి అర్హత ఉంటుంది. సిమెంట్ స్తంభాలతో వేసుకునే శాశ్వత పందిరి స్కీమ్‌లో భాగంగా ఎకరాకు రూ.లక్ష వరకూ ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. ఒక రైతుకు గరిష్టంగా 2.5 ఎకరాల వరకూ రాయితీ పొందవచ్చు.

సాగు లాభదాయకం



దొండ పాదుల సాగు లాభదాయకంగా ఉంటుంది. మొదట్లో పెట్టుబడులు అధికంగా ఉన్నా లాభాలు ఆర్జించవచ్చు. ఉద్యాన శాఖ తీగ జాతి పంటలకు రాయితీలు అందిస్తుంది. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలి.

–జి.కోటేశ్వరరావు, ఉద్యాన అధికారి, కొత్తపేట

సద్వినియోగం చేసుకోండి



రైతులు కూరగాయల సాగుపై కూడా ఆసక్తి చూపించాలి. ముఖ్యంగా తీగజాతి పంటలు వేస్తే లాభసాటిగా ఉంటుంది. అధిక దిగుబడులకు ఆస్కారముంది. ప్రభుత్వం తీగజాతి పంటలకు రాయితీలు ఇస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–ఎం.అనూష, ఉద్యాన అధికారి, రామచంద్రపురం

హెచ్చరిక

మా క్లయింట్లు రాజమహేంద్రవరం కాపురస్తులు 1. శ్రీ పిల్లి సుబ్రహ్మణ్యం తండ్రి (లేటు) వెంకటేశ్వర్లు 2. పిల్లి సిరిబాల కుమారస్వామి తండ్రి సుబ్రహ్మణ్యం గార్లు మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయు నది ఏమనగా నా వ క్లయింటు అయిన పిల్లి సుబ్రహ్మణ్యం, కంతేటి వెంకట సుబ్రహ్మణ్యం మరియు ఆరుగురు వద్ద ది.09.07.2019 తేదిన ఈ దిగువున ఉదహరించిన ఐటెం నెం.1 నోటీసు షెడ్యూల్ ఆస్తిని రూ. 2,30,00,000/-కు క్రియ అగ్రిమెంటు పొంది వున్నారు.

అదేవిధంగా మా రెండవ క్లైంటు అయిన పిల్లి సిరిబాల కుమారస్వామి, వాసిరెడ్డి లీలావతి గారి వద్ద నుండి ఈ దిగువ ఉదహరించిన ఐటెం నెం.2 నోటీసు షెడ్యూల్ ఆస్తిని రూ.80,00,000/-కు క్రియ అగ్రిమెంటు పొంది వున్నారు.

ఈ దిగువ తెలిపిన వ్యక్తులు అనగా 1. గారపాటి శిరీష 2. గారపాటి రాజశేఖర్ సర్వారాయుడు 3. కరుటూరి సత్యవతి 4. గారపాటి సూర్య రాజు 5. గారపాటి శ్రీ అమర్నాథ్ 6. గారపాటి రమణారావు 7. గారపాటి అచ్యుత వెంకట శివరామప్రసాద్ 8. దిమ్మలపూడి సుబ్బారావు 9. దుదుపూడి లక్ష్మమాంబ వరలక్ష్మి 10. చకూరి జయసూర్య మరియు ఇతరులు

షెడ్యూల్ ఆస్తి తమదని తప్పుడు ప్రచారం ఇతరులకు అమ్ముజూపుచున్నారని రూఢిగా మా క్లయింటుకు తెలియవచ్చినది. ఈ షెడ్యూల్ ఆస్తి వారిది కాదనియు అట్లు అసత్య ప్రచారం చేస్తున్నారనియు అట్లు నమ్మి ఎవరైనా కొనుగోలు చేసిన యెడల మోసపోవుదురు అని మా క్లయింట్లను బైండు చేయవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి

ఐటెం నెం.1 – తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం మండలం, శ్రీ రాజమండ్రి జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసుకు చెందిన రాజమండ్రి సబ్ రిజిస్ట్రారులో చేరిన రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, (పూర్వం పిడింగొయ్య గ్రామ పంచాయితీ) మోరంపూడి జంక్షన్, ఎన్‌హెచ్-5కు చేరి రి.సర్వే నెం.384/1ఎ రు పురా య.15.14 ట్లులో ఎన్‌హెచ్-5 రోడ్ క్రింది పోయినది గాక మిగిలిన య.14.89 ట్లులో య.9.00 ట్లులో తూర్పు వైపు మా తావులకు య.3.00 ట్లులో లేక 1.214 హెక్టార్లు భూమికి హద్దులు

తూర్పు : ఐ.ఎల్.టి.డి వారి భూమి;
దక్షిణం : ఎన్ హెచ్ 5 రోడ్;
పడమర : ఈ నెంబరులో పిల్లి అనంతలక్ష్మి అనే వెంకటలక్ష్మి గారి వాటా భూమి;
ఉత్తరం : అ 80 లు వెడల్పుగల రోడ్.

సదరు హద్దులు మధ్య య.3.00 ట్లులో భూమిని, యిందుగల జల తరు నిధి నిక్షేపములు సమస్తములగు నీటివర్లు, రివజుదారి మార్గములు.

ఐటెం నెం.2 – తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం మండలం, శ్రీ రాజమండ్రి జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసుకు చెందిన రాజమండ్రి సబ్ రిజిస్ట్రారులో చేరిన రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, (పూర్వం పిడింగొయ్య గ్రామ పంచాయితీ) మోరంపూడి జంక్షన్, ఎన్‌హెచ్-5కు చేరి రి.సర్వే నెం. 384/1ఎ రు పురా య.15.14 ట్లులో ఎన్‌హెచ్-5 రోడ్ క్రింది పోయినది గాక మిగిలిన య.14.89 ట్లులో య.9.00 ట్లులో తూర్పు వైపు మా తావులకు య.3.00 ట్లులో భూమికి హద్దులు:

తూర్పు : ఐ.ఎల్.టి.డి వారి భూమి;
దక్షిణం : ఎన్ హెచ్ 5 రోడ్,
పడమర : ఈ నెంబరులో పిల్లి అనంతలక్ష్మి అనే వెంకటలక్ష్మి గారి వాటా భూమి;
ఉత్తరం : అ 80 లు వెడల్పుగల రోడ్.

సదరు హద్దులు మధ్య య.3.00 ట్లులో భూమిలో నా వాటాకు రాబడినటువంటి అనిర్దిష్టపు అవిభాజ్యపు జాయింటు హక్కు య.0.25 ట్లు భూమిని, యిందుగల జల తరు నిధి నిక్షేపములు సమస్తములగు నీటివర్లు, రివజుదారి మార్గములు, ఈజిమెంట్లు హక్కులతో సహా.

ఇట్లు.. **ఎస్.కుమార్**, అడ్వకేట్
78-10-10, శ్యామలనగర్, రాజమహేంద్రవరం. ఫోన్ : 0883-2467562

నిత్య నిర్మలా గోవిందా..


ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామి

- వాడపల్లి క్షేత్రంలో ఆధ్యాత్మిక పరవళ్లు
- ఒక్కరోజే ఆలయానికి రూ.39.01 లక్షల ఆదాయం


ఆలయం వద్ద భక్తుల కోలాహలం

ఆత్రేయపురం: గోవింద హరి గోవింద నామస్మరణతో కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం మార్మోగింది. శనివారం ఆ స్వామివారిని కొలిచి భక్తజనం తరించింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పండ్లు, పుష్పాలతో అర్చకులు అలంకరించారు. ఆలయ ఆవరణలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామిని, క్షేత్ర పాలకులు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరించే భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.39,01,965 ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

క్షుద్రపూజల కలకలం

అన్నీ వదంతులే: ఎస్సై రమేష్‌బాబు


క్షుద్రపూజలు జరిగినట్లు భావిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తుని రూరల్: తుని మండలం వెలమ కొత్తూరు, లోవకొత్తూరు గ్రామాల సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేస్తున్నారన్న వదంతులు రావడంతో కలకలం రేగింది. ఈ విషయాన్ని స్థానికులు తెలపడంతో ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించామని రూరల్ ఎస్సై రమేష్ బాబు తెలిపారు. తలుపులమ్మ తల్లి లోవ దేవస్థానికి వెళ్లే మార్గం పక్కన పోలవరం కాలువ వద్ద సంచార జాతులకు చెందిన కొంతమంది దున్నపోతును అమ్మవారికి బలి ఇచ్చినట్లు తెలుస్తుందన్నారు. ఆదివారం అమావాస్య రోజు పూజ జరుగుతుండటాన్ని చూసిన ఓ వ్యక్తి ఏంటని ప్రశ్నించగా, అతడిపై దాడి చేశారన్నారు. దాంతో క్షుద్రపూజలు చేస్తున్నారని అనుమానించి ఆ వ్యక్తి గ్రామస్తులకు విషయాన్ని చెప్పాడన్నారు. గ్రామస్తులంతా వచ్చి పూజలు చేస్తున్న సంచార జాతుల వ్యక్తులపై దాడికి పాల్పడ్డారన్నారు. దీంతో పూజలు చేసిన వ్యక్తులు పరారయ్యారన్నారు. ఈ సంఘటనలో గ్రామస్తులకు, సంచార జాతుల వ్యక్తులకు స్వల్ప గాయాలైనట్లు ఎస్సై వివరించారు. క్షుద్ర పూజలు చేశారన్నది వదంతులేనని స్పష్టం చేశారు. ఇటువంటివి ఎవరూ నమ్మవద్దన్నారు. క్షుద్రపూజలు కాదని వారి సంప్రదాయంలో అమ్మవారికి మొక్కు తీర్చుకున్నట్లు ఎస్సై వివరించారు.

గోదావరిలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

యానాం: యానాం గౌతమీ గోదావరి బాలయోగి వారధి పైనుంచి ఓ వివాహిత గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నానికి ఒడిగట్టింది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామానికి చెందిన గుత్తుల పద్మకుమారి శనివారం బాలయోగి వారధి నుంచి దూకేసింది. ఈ నేపథ్యంలో అక్కడే పర్యాటక బోటు నిర్వహించే సీగల్స్ సంస్థ సిబ్బంది సకాలంలో స్పందించి ఆమెను రక్షించారు. హుటాహుటిన యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై యానాం పోలీసులు విచారణ చేస్తున్నారు.


మహిళను రక్షించి ఒడ్డుకు తీసుకు వస్తున్న సీగల్స్ సిబ్బంది

ఆర్ట్స్, పీఆర్ కళాశాలల ఒప్పందం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) అధిపతి డాక్టర్ కె.రామచంద్రరావు నేతృత్వంలో కళాశాల తెలుగు శాఖకు, కాకినాడ పీఆర్ కళాశాల తెలుగు శాఖకు అవగాహన ఒప్పందం జరిగింది. శనివారం ఇక్కడి ప్రిన్సిపల్ చాంబర్‌లో డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఇరు కళాశాలల తెలుగు శాఖలు పరస్పర అవగాహన ఒప్పందంతో విద్యార్థి ప్రపంచానికి తెలుగు వెలుగులను అందించేందుకు నిర్ణయించారన్నారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీఏ సత్యనారాయణ మాట్లాడుతూ పరిశోధనల ప్రభంజనల వైపు నడుస్తున్న ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అరుదైన పరిశోధన గనిగా ఎదగడానికి ఈ ఒప్పందం పనిచేస్తుందని అన్నారు. పీఆర్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.ప్రేమకుమారి, కొప్పిశెట్టి అరుణ కుమారి మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాలతో ఈ జ్ఞాన వినిమయ ఒప్పందం కుదుర్చుకుని ముందుకు వెళ్లడం, తెలుగు భాషా వైభవానికి దోహదం చేస్తుందన్నారు. దీనిపై పరస్పర ఒప్పంద సంతకాలు జరిగాయని కళాశాల అకడమిక్ కో ఆర్డినేటర్ సంజీవ్‌కుమార్, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ జరీనా బేగం, డాక్టర్ బి.సుబ్బలక్ష్మి, డాక్టర్ ఎస్.సముద్రాల.ప్రిస్కిళ్ల, జి.శ్రీనివాస్, అలికాని సత్య శివకుమార్, తాడి రేవతి తదితరులు పాల్గొన్నారు.